# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-03-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **వికసిత్ భారత్ నిర్మాణానికి గ్రామాల అభివృద్ధే తొలి మెట్టు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**
2. **తిరుమలలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు.**
3. **విశాఖపట్నం అభివృద్ధి, బృహత్తర ప్రణాళికపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఈ రోజు సమీక్ష నిర్వహించారు.**
4. **రాబోయే మూడు నెలలు అధిక ఉష్ణోగ్రత, వడగాల్పులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సూచించారు.**
5. **కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశాలకు రేపటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు.**

==========================

వికసిత్ భారత్ నిర్మాణంలో తొలి ప్రాధాన్యంగా గ్రామాలను అభివృద్ధి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. గుజరాత్‌లోని భర్వాద్ సమాజ్‌కు సంబంధించిన బవలియాలి ధామ్ కార్యక్రమంలో ఆయన దృశ్య మాధ్యమ సందేశం వెలువరించారు. "సబ్ కా ప్రయాస్" దేశానికి గొప్ప బలం అని ఢిల్లీలోని ఎర్రకోట నుంచి తాను చేసిన ప్రకటనను పునరుద్ఘాటిస్తూ, సమష్టి ప్రయత్నాలు అత్యంత ప్రాముఖ్యమైనవని ప్రధానమంత్రి స్పష్టంచేశారు. ఆధునిక సమాజాన్ని శక్తివంతం చేయడానికి విద్య చాలా ముఖ్యమైనదని చెప్పారు. సమాజంలోని చిన్నారులు, ముఖ్యంగా బాలికలు విద్యాపరంగా రాణించి బలమైన సమాజానికి తోడ్పడాలని ప్రధానమంత్రి ఆకాంక్షించారు.

--------------------------

తిరుమలలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఈ రోజు కుటుంబ సమేతంగా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన, కుటుంబ సభ్యులు తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. అనంతరం చంద్రబాబునాయుడు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లో

వేంకటేశ్వరస్వామి ఆలయాలను నిర్మించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సమాజ హితం కోసం అందరూ పనిచేయాలని చంద్రబాబునాయుడు సూచిస్తూ...

**వాయిస్ (36 సెకన్లు)**

---------------------------

దేశవ్యాప్తంగా వచ్చే నెల 2వ తేదీ నుంచి జేఈఈ మెయిన్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఏ నగరంలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించారో జాతీయ పరీక్షల సంస్థ..ఎన్‌టీఏ వెల్లడించింది. విద్యార్థులు దరఖాస్తు సమయంలో పరీక్షలు రాసేందుకు తమకు అనువైన ఆరు నగరాలు/పట్టణాలను ఎంచుకోవాలి. ఈ క్రమంలో కేటాయించిన పరీక్ష నగరం గురించి ముందస్తు సమాచారంగా తెలిపింది. పరీక్ష ప్రారంభానికి మూడు రోజుల ముందు అడ్మిన్ కార్డును అందుబాటులో ఉంచుతుంది. పరీక్షా కేంద్రం ఎక్కడ, ఏ తేదీన పరీక్ష నిర్వహిస్తారు అనే వివరాలు అందులో ఉంటాయని ఎన్‌టీఏ వెల్లడించింది.

---------------------------

ప్రధానమంత్రి యోగా పురస్కారం- 2025కు అర్హత కలిగిన పౌరుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అనంతపురం యువజన సర్వీసుల శాఖ జిల్లా మేనేజర్ పి.సునీల్ కుమార్ రెడ్డి తెలిపారు. యువజన సర్వీసుల శాఖ కార్యాలయంలో ఈ రోజు ఆయన మాట్లాడుతూ యోగా ప్రచారం, అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేసిన వ్యక్తులు, జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుండి విభాగాల వారీగా దరఖాస్తులను స్వీకరిస్తున్నామని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ విభాగాలకు వ్యక్తిగత కేటగిరీలో దరఖాస్తుదారునికి కనీస వయోపరిమితి 40 ఏళ్లు ఉండాలని సునీల్ కుమార్ రెడ్డి వివరిస్తూ..

**వాయిస్ ( 33 సెకన్లు)**

---------------------------

విశాఖపట్నంలో టీడీఆర్ బాండ్లను త్వరితగతిన జారీ చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం అభివృద్ధి, బృహత్తర ప్రణాళికపై సచివాలయంలో ఆయన ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన శాసనసభ్యులు, రెవెన్యూ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. విశాఖపట్నంలో మెట్రో రైల్ కారిడార్ల పొడిగింపు అంశాన్ని ఈ సందర్భంగా శాసనసభ్యులు ప్రస్తావించారు. భోగాపురం విమానాశ్రయం అనుసంధానం, ట్రాఫిక్ సమస్యలపై చర్చించారు.

---------------------------

ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని ఆర్థిక శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ మేరకు సీపీఎస్, జీపీఎఫ్, ఏపీజీఏఐ కింద కలిపి 6 వేల 200 కోట్ల రూపాయలను ఈ రోజు విడుదల చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది జనవరి 11వ తేదీన ఉద్యోగులకు వివిధ బకాయిల కింద వెయ్యా 33 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. కాగా.. ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్ల బకాయిలకు సంబంధించి 6 వేల 200 కోట్ల రూపాయల విడుదలకు ప్రభుత్వం ఆదేశాలివ్వడంపై ఆంధ్రప్రదేశ్ ఐక్య కార్యాచరణ కమిటీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

---------------------------

రాబోయే మూడు నెలలు అధిక ఉష్ణోగ్రత, వడగాల్పులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సూచించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాల్పుల సన్నద్ధతపై సచివాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో ఆయన నిన్న దృశ్య మాధ్యమ విధానంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 40 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తెలిపారు. వడగాల్పుల నుంచి కాపాడుకునేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేలా ప్రజల్లో అవగాహన కలిగించాలని విపత్తుల నిర్వహణ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఉపాధి కూలీలకు పని ప్రాంతాల్లో తాగునీరు, మజ్జిగ, ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని విజయానంద్ దిశానిర్దేశం చేశారు.

---------------------------

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు..ఏపీకేజీబీవీల్లో ప్రవేశాలకు రేపటి నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలోని 352 కేజీబీవీల్లో 2025-28 విద్యాసంవత్సరానికి 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు, అదే విధంగా 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం బాలికల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. apkgbv.apcfss వెబ్‌సైట్‌లో దరఖాస్తు పూరించాలని శ్రీనివాసరావు సూచించారు.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

**వాయిస్ ( 35 సెకన్లు )**

---------------------------

అక్షరాస్యత అర్హత పరీక్షను ఎల్లుండి నిర్వహిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఈ రోజు ఆయన ఉల్లాస్ గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. "ఉల్లాస్ కార్యక్రమం" పార్వతీపురం మన్యం జిల్లాలో 2024 నవంబర్ 15వ తేదీన ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వయోజనులకు చదవడం, రాయడం, చిన్న చిన్న లెక్కలు చేయడం నేర్పించామని వెల్లడించారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత ఇతర జీవిత నైపుణ్యాలను అభివృద్ధి చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

======================